# నవతరం

నేటితరం కోసం...

హైదరాబాద్ | గురువారం, డిసెంబరు 25, 2025 | సంపుటి:11 | సంచిక : 246 | పేజీలు: 4 | వెల : రూ.5


### వుడా మాజీ చీఫ్ ప్రదీప్ ఆస్తుల జప్తు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో వుడా మాజీ అదనపు చీఫ్ అర్బన్ ప్లానర్ పసుపర్తి ప్రదీప్ కుమార్ ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. హైదరాబాద్‌లో ఉన్న రూ.1.09 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రదీప్ కుమార్‌పై 2018లో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# మళ్లీ.. అధికారం మాదే: సీఎం రేవంత్



### 119 ఉంటే 80..
### 153 ఉంటే 100 సీట్లకు పైగా గెలుస్తాం: సీఎం రేవంత్

- నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వ..
- కొడంగల్ గడ్డ మీద నుంచి ఇదే నా సవాల్.. ఇదే నా శపథం
- బీఆర్ఎస్, కల్వకుంట్ల చరిత్ర గతమే.. తెలంగాణ భవిష్యత్ కాంగ్రెస్సే..
- పెద్ద పంచాయతీలకు రూ.10 లక్షలు,చిన్న జీపీలకు రూ.5 లక్షలు ఇస్తాం
- అన్ని ప్రభుత్వ బడుల్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం
- పంచాయతీ పాలకవర్గాల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం వెల్లడి

మహబూబ్‌నగర్: 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మూడింట రెండొంతుల మెజార్టీతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. 119 నియోజకవర్గాలు ఉంటే 80 సీట్లతో, డీలిమిటేషన్‌తో 153 ఉంటే 100 సీట్లకు పైగా గెలిచి అధికారంలోకి వస్తాం'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'నీ రాజకీయమేందో నేను చూస్తా. నేను రాజకీయం చేసినంత కాలం కల్వకుంట్ల కాలకూట విషం లాంటి కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వ. కొడంగల్ బిడ్డగా ఈ గడ్డ మీద నుంచి శపథం చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం కేసీఆర్ కుటుంబానికి అధికారం అనేది ఓ కల. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ చరిత్ర గతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్ లేదు. రాష్ట్రానికి నీ తరఫున ఒరిగేదేమీ లేదు. తెలంగాణ భవిష్యత్ కాంగ్రెస్సే'అని రేవంత్ అన్నారు. బుధవారం నారాయణపేట

(మిగతా 2వ పేజీలో)



2లో

## ముఖ్యమంత్రి మార్పా, ఈ ప్రచారం ఎందుకు జరుగుతోంది?

- ముఖ్యమంత్రి పదవి విషయంలో ఎలాంటి విభేదాలు లేవని వెల్లడి
- మీడియాలో మాత్రమే ఊహాగానాలు వస్తున్నాయన్న శివకుమార్
- పార్టీలో లేదా ప్రభుత్వంలో 'మార్పు'పై ఎలాంటి చర్చ లేదని స్పష్టీకరణ



## "అరుణాచల్ ప్రదేశ్"పై చైనా కన్ను..

తన ప్రధాన ఆసక్తుల్లో ఒకటిగా ఎర్కొన్న డ్రాగన్ కంట్రీ..

యూఎస్ నివేదికలో కీలక విషయాలు..

2లో



## రాహుల్ గాంధీని కలిసిన ఉన్నావ్ అత్యాచార బాధితురాలు..

నిందితుడు సెంగార్‌ను హైకోర్టు విడుదల చేయడంపై ఆగ్రహం..



2లో

## ఆరావళి మైనింగ్‌పై వెనక్కి తగ్గిన కేంద్రం

- ఆరావళి పర్వతాల్లో కొత్త మైనింగ్ లీజులపై పూర్తి నిషేధం విధించిన కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశాలు
- ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించిన పర్వతశ్రేణికి వర్తింపు
- సుస్థిర మైనింగ్ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపకల్పనకు ఐసీఎఫ్ఆర్ఈకి బాధ్యత
- ఇప్పటికే ఉన్న గనులపై మరింత కఠిన నిబంధనలు అమలు

# 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

- స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే మొదటి ప్రాధాన్యత అని స్పష్టీకరణ
- పది సూత్రాలను పది మిషన్లుగా అమలు చేయాలని అధికారులకు ఆదేశం
- నీటి భద్రత, వ్యవసాయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- 'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేయాలని దిశానిర్దేశం



స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధన కోసం రూపొందించిన పది సూత్రాలను పది మిషన్లుగా స్వీకరించి పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలనలో వేగాన్ని పెంచి, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రతి ప్రభుత్వ శాఖ పనితీరును తెలిపే ప్రత్యేక సూచికలను (ఇండికేటర్లు) సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సచివాలయంలో ఇవాళ ఆయన స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే అత్యంత ప్రాధాన్యతాంశమని స్పష్టం చేశారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. జీరో పావర్టీ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని 30 లక్షల పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాన్ని అంచనా వేయాలని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు.

## మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్.. మూడేళ్ల హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం

- ఇచ్చిన మాట ప్రకారం ఇండ్ల నాగేశ్వరమ్మను కలిసిన జనసేనాని
- ఆమెకు రూ.50 వేల సాయం, మనవడి చదువుకు రూ.లక్ష ప్రకటన
- ప్రతి నెలా రూ.5 వేల వ్యక్తిగత సహాయానికి హామీ ఇచ్చిన పవన్
- ఇప్పటం గ్రామంలో భావోద్వేగ వాతావరణం

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఈరోజు గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామాన్ని సందర్శించారు. మూడేళ్ల క్రితం ఇచ్చిన హామీ మేరకు అక్కడ నివసిస్తున్న వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మను ఆయన కలిశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న పవన్ కల్యాణ్, ఆప్యాయంగా ఆమెను ఆలింగనం చేసుకున్నారు.

మిగతా 2లో





2లో

## విషయం లేకే విషకూతలు

- అహంకారం తలకెకి ఉన్మాదిలా ప్రవర్తిస్తున్న రేవంత్‌ను ప్రజలు క్షమించరు
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గి సభలో కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు, తిట్ల దండకంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కొత్త సినిమాల టికెట్ల రేట్ల పెంపుపై మంత్రి కందుల దర్గేష్ వ్యాఖ్యలు..

- ప్రతి సారి సినిమా టికెట్ రేట్లు పెంచడం వల్ల ఇబ్బందులు..
- టికెట్ రేట్లకు సంబంధించి ఒకే జీవో ఉండేలా నిర్ణయం..
- పెద్ద బడ్జెట్ సినిమా... ఆర్టిస్టుల రెమ్యునరేషన్ పై కూడా చర్చించి నిర్ణయం



2లో



## బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ శాఖకు 'చీకటి రోజులు'..

- పాలమూరు ఎత్తిపోతలపై బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదన్న ఉత్తమ్
- కాళేశ్వరం పేరుతో వేల కోట్లు.. ఫలితం శూన్యం
- కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ ఘోర వైఫల్యం
- మూడేళ్లలో ఎస్ఎల్బీసి పూర్తి చేస్తామని హామీ

# 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)జ

నీటి భద్రతను కీలక మిషన్‌గా పరిగణించి, నీటి వనరుల సమర్థ వినియోగంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటి ఆడిట్ నిర్వహించాలని, వివాదాలకు తావులేకుండా చూడాలని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. 'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించాలని, అరకు కాఫీ తరహాలో రాష్ట్ర ఉత్పత్తులకు నాణ్యతతో కూడిన గుర్తింపు తీసుకురావాలని సీఎం సూచించారు. రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్, స్వచ్ఛాంధ్ర కోసం సర్క్యులర్ ఎకానమీ, సాంకేతికత వినియోగంతో పౌర సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆరావళి మైనింగ్‌పై వెనక్కి తగ్గిన కేంద్రం..

ఆరావళి పర్వత శ్రేణుల పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పర్వత శ్రేణిలో కొత్తగా ఎలాంటి మైనింగ్ లీజులు మంజూరు చేయవద్దని పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించి ఉన్న మొత్తం ఆరావళి ప్రాంతానికి ఈ ఆదేశాలు వర్తిస్తాయని కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (%వీశీజుఖీడజజ%) స్పష్టం చేసింది. అక్రమ, అనియంత్రిత మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంతో పాటు ఈ పర్వతాలను ఒకే భౌగోళిక వ్యవస్థగా పరిరక్షించడమే తమ లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ఈ నిషేధాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు గాను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (%×జఖీ=జు%)కు కీలక బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఉన్న నిషేధిత ప్రాంతాలకు అదనంగా, మైనింగ్‌ను శాశ్వతంగా నిషేధించాల్సిన మరిన్ని ప్రాంతాలను శాస్త్రీయంగా గుర్తించాలని ఆదేశించింది. అలాగే మొత్తం ఆరావళి ప్రాంతానికి 'సుస్థిర మైనింగ్ యాజమాన్య ప్రణాళిక'ను రూపొందించాలని సూచించింది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అనుమతులతో నడుస్తున్న మైనింగ్ కార్యకలాపాలపై మరింత కఠిన నిబంధనలు అమలు చేయాలని, పర్యావరణ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని కేంద్రం రాష్ట్రాలకు స్పష్టం చేసింది. భూగర్భ జలాలను పరిరక్షించడంలో ఆరావళి పర్వతాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించింది.

## ముఖ్యమంత్రి మార్పా, ఈ ప్రచారం ఎందుకు జరుగుతోంది?

కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ మార్పు, ముఖ్యమంత్రి పదవి అంశంపై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే. శివకుమార్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. నాయకత్వ మార్పు అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి పదవి కోసం తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని చెప్పడం గమనార్హం. "అసలు ఈ ఊహాగానాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? మీడియాలో మాత్రమే ఈ ప్రచారం జరుగుతోంది. పార్టీలో లేదా ప్రభుత్వంలో ఎక్కడా ఎటువంటి ప్రచారం జరగడం లేదు" అని న్యూఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పేర్కొన్నారు. మిగతా రెండున్నరేళ్లు ఉప ముఖ్యమంత్రిగా కొనసాగడం మీకు సమ్మతమేనా అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, పార్టీలో పదవుల కంటే కార్యకర్తగా ఉండటమే తనకు సంతోషమని పేర్కొన్నారు. కార్యకర్త అనేది తనకు శాశ్వత పదవి అని, 1980 నుండి కార్యకర్తగా ఉన్నానని, భవిష్యత్తులోనూ కొనసాగుతానని అన్నారు. ప్రస్తుతం ఢిల్లీలో తమ పార్టీకి చెందిన కీలక నాయకులు ఎవరూ లేరని, అందుకే కలవడం లేదని వెల్లడించారు. మల్లికార్జున ఖర్గే బెంగళూరులో ఉండగా, రాహుల్ గాంధీ పర్యటన ముగించుకుని వచ్చారని, కాబట్టి ఆయనను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదని తెలిపారు. ముఖ్యమంత్రిగా తానే పూర్తి కాలం కొనసాగుతానని సిద్ధరామయ్య ఇటీవల అసెంబ్లీలో ప్రకటించారు. ఆ తర్వాత ఇరువురి మధ్య మాటల యుద్ధం నడిచింది. ఇలాంటి సమయంలో శివకుమార్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## "అరుణాచల్ ప్రదేశ్"పై చైనా కన్ను..

భారత అంతర్భాగమైన "అరుణాచల్ ప్రదేశ్" తమదే అని, అది దక్షిణ టిబెట్‌లో భాగమని చైనా ఎప్పటి నుంచో వాదిస్తోంది. అయితే, ఎప్పటికప్పుడు అరుణాచల్ తమ దేశం నుంచి విడదీయలేని అంతర్భాగమని భారత్ కౌంటర్ ఇస్తోంది. ఇదిలా ఉంటే, తాజాగా అమెరికన్ కాంగ్రెస్‌కు సమర్పించిన పెంటగాన్ నివేదికలో, అరుణాచల్ ప్రదేశ్ చైనా 'ప్రధాన ఆసక్తుల్లో' ఒకటిని చెప్పింది. అరుణాచల్‌పై చైనా రాజీకి, చర్చలకు సిద్ధంగా లేదని నివేదిక పేర్కొంది. చైనాలోని కమ్యూనిస్ట్ ప్రభుత్వం తైవాన్, దక్షిణ చైనా సముద్రంలోని వివాదస్పద ప్రాంతాలు, జపాన్ సమీపంలోని సెన్‌కాకు దీవులతో పాటు అరుణాచల్ ప్రదేశ్‌ను తన ప్రధాన ఆసక్తుల్లో ఒకటిగా చేర్చిందని నివేదిక పేర్కొంది. చైనా అధికారుల ప్రకారం, వివాదాస్పద భూభాగాలతో సహా దేశ ఏకీకరణను 2049 నాటికి సాధించాలని, "చైనా జాతీయ మహా పునరుజ్జీవనం" అవసరమని చెబుతున్నారు. ఆ దశలో చైనా ప్రపంచ స్థాయిలో కొత్త శక్తిగా ఎదిగి, యుద్ధంలో గెలిచే సామర్థ్యం ఉన్న ప్రపంచస్థాయి సైన్యాన్ని కలిగి ఉంటుందని నివేదిక పేర్కొంది.

## రాహుల్ గాంధీని కలిసిన ఉన్నావ్ అత్యాచార బాధితురాలు..

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన "ఉన్నావ్ అత్యాచారం" కేసులో దోషిగా తేలిన మాజీ బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు ఉపశమనం ఇచ్చింది. సెంగార్ ఈ కేసులో తనపై వచ్చిన ఆరోపణల్ని, జైలు శిక్షను సవాల్ చేశాడు. హైకోర్టు సెంగార్ శిక్షను నిలిపివేస్తూ బెయిల్ మంజూరు చేసింది. ఆయన ఇప్పటికే 7 ఏళ్ల 5 నెలల జైలు శిక్ష పూర్తి చేయడంతో న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఆయనకు బెయిల్ ఇవ్వడంపై బాధితురాలు, ఆమె తల్లి ఢిల్లీలో ఆందోళనకు దిగారు. తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్నవారిని పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి తరలించడం వివాదస్పమైంది. ఇదిలా ఉంటే, తమకు న్యాయం చేయాలని కోరుతూ, ఉన్నావ్ అత్యాచార కేసులో బాధితురాలు,ఆమె తల్లి ఈ సాయంత్రం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని కలిశారు.

## తెలంగాణ వ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం



**హైదరాబాద్ డిసెంబర్ 24 సూర్య న్యూస్ :-** భారతదేశం, విదేశాలలో పెరుగుతున్న డిమాండ్ ను ఎదుర్కొంటున్న సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సులలో ఆన్‌లైన్ శిక్షణ కోసం నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ తెలంగాణ వ్యాప్తంగా అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించింది. ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, పాలిటెక్నిక్ డిప్లొమా, ఇంజనీరింగ్ ప్రోగ్రామ్ లలో ఉత్తీర్ణులైన లేదా చదువుతున్న అభ్యర్థులకు ఈ కోర్సులు తెరిచి ఉన్నాయి. సాఫ్ట్‌వేర్, ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, డిఫెన్స్, పోలీస్ డిపార్ట్‌మెంట్, రిటైల్, ఈ–కామర్స్ మరియు విద్య వంటి రంగాల నుండి పనిచేసే నిపుణులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఎన్ ఎ సి ఎస్ సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, మాస్టర్ ప్రోగ్రామ్ ఇన్ సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ వంటి కోర్సులను అందిస్తోంది. శిక్షణ వ్యవధి ఐదు నుండి పది నెలల వరకు ఉంటుంది. అకాడమీ ప్రకారం, కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ఉన్న సంస్థ కింద సర్టిఫికెట్లు ప్రదానం చేయబడతాయి. శిక్షణ పొందిన అభ్యర్థులకు భారతదేశం, విదేశాలలో సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ అనలిస్ట్, పెనెట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ ఇంజనీర్, సెక్యూరిటీ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్, ట్రైనర్ వంటి వివిధ రంగాలలో విస్తృత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం www.nacsindia.org వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు లేదా 7893141797 నంబర్ ను సంప్రదించవచ్చు. నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ విమల రెడ్డి మాట్లాడుతూ యువత, పని చేసే నిపుణులను పరిశ్రమకు సంబంధించిన సైబర్ భద్రతా నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే ఈ చొరవ లక్ష్యం అని అన్నారు.

## అల్విన్ కాలనీ డివిజన్ పాస్టర్లకు క్రిస్మస్ కనుక అందించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**శేరిలింగంపల్లి డిసెంబర్ 24 సూర్య న్యూస్ :-** క్రిస్మస్ పండుగ శుభసందర్భంగా అల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ తో కలిసి వారి కార్యాలయంలో డివిజన్లో ఉన్న సుమారు 60 మంది పాస్టర్ల కుటుంబాలకు క్రిస్మస్ కానుకలు (దుస్తులను) అందించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శాంతి, నీతి, ప్రేమ, దయ కరుణ లతో ప్రపంచానికి కొత్త మార్గం నిర్దేశించిన క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులందరికి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు. క్రిస్మస్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ లోని పాస్టరలందరు ఎంతో ప్రేమ చూపిస్తూ నాకోసం మరియు మా కుటుంబం కోసం ప్రార్థనలు చేస్తూ ఉంటారాని గుర్తుచేసారు. డివిజన్ ప్రజలందరికి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ రెడ్డి, మోజెస్, పాస్టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి : కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బ్యూరో డిసెంబర్ 24 సూర్య న్యూస్ :-** యేసుక్రీస్తు జన్మదినోత్సవమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. గురువారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్ జన్మదినాన్ని క్రైస్తవులు జరుపుకొనే క్రిస్మస్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు ఎంతో పవిత్రంగా భావిస్తారని కలెక్టరు అన్నారు. జీసస్ కరుణామయుడుగా, దయామయుడుగా అందరి ఆరాధనలు అందుకుంటున్నారని అన్నారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం, శత్రువుల పట్ల సైతం క్షమా గుణం కలిగి ఉండటమే యేసుక్రీస్తు అందరికి ప్రబోధించారని దీనిని అనుసరించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి




**కరీంనగర్ డిసెంబర్ 24 సూర్య న్యూస్ :-** ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ టి.యు జేఏసీ సమావేశం కరీంనగర్ లోని ఫిలిం భవన్ లో జరిగింది తెలంగాణ పునర్నిర్మాణంలో ఉద్యమకారుల పాత్ర పై కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షులు బొత్తా వెంకట మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులందరికీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గృహ నిర్మాణంలో ప్రాధాన్యత నివ్వాలని, పెన్షన్ మంజూరు చేయాలని కళాకారులకు ఉపాధి ఉద్యోగం కల్పించాలని అలా చేసే వరకు నిరంతరంగా టి.యు జెఏసి ఉద్యమిస్తుంది అన్నారు. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన ఉద్యమకారుల కుటుంబాలకు లబ్ధి చేకూర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి అన్నారు బొత్తా వెంకట మల్లయ్య మాట్లాడుతూ ఇక్కడ మహిళా శక్తిని చూస్తే ఏ ప్రభుత్వమైనా దిగి రావాల్సిందే అన్నారు. మహిళా శక్తి ఉద్యమంలో దూకితే సాధించలేనిది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని సత్యనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం మారుతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సి ఎస్ ప్రసాద్, కంచర్ల బద్రి వేముల యాదగిరి, బాకారం లావణ్య, మోహన్ బైరాగి బాల లక్ష్మి, కే సి ఎస్ ప్రసాద్, కంచర్ల బద్రి వేముల తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి : కీలుకానీ లక్ష్మణ్

**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 24 సూర్య న్యూస్ :-** ఈనెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ 18వ మహాసభలను జయప్రదం చేయాలని షాపూర్ నగర్ ఈఎస్ఐ చౌరస్తా ఆటో స్టాండ్ దగ్గర సిఐటియు జెండాను మేడ్చల్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు ఈ.దేవదానం ఆవిష్కరించి ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత మహాసభల విజయవంతం కోరుతూ మేడ్చల్ జిల్లా పరిధిలో పారిశ్రామిక ప్రాంతాలు. అసంఘటితరంగా కార్మికుల అడ్డాల దగ్గర విస్తృతంగా ప్రచారం చేయడం జరుగుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో మోడీ ప్రభుత్వం రూపొందించిన లేబర్ కోడ్‌ల పై కార్మికులంతా ఐక్యంగా సమర శంఖం పూరించాని పిలుపునిచ్చారు. పాలకుల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు కార్మిక వర్గ ఐక్యతను చాటుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో సిఐటియు అగ్రగామిగా ఉందన్నారు. జనవరి 31 నుండి విశాఖపట్నంలో జాతీయ జరిగే మహాసభలలో కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు రూపకల్పన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య ఆటో నాయకులు మహమ్మద్ గని. సాహేత్.



సిఐటియు మండల నాయకులు కె.శీను, మల్లారెడ్డి, తిమ్మప్ప, కనకయ్య, శ్రీశైలం, సునీల్, ముని, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సినిమాల టికెట్ల రేట్ల పెంపుపై
### మంత్రి కందుల దర్గేష్ ఆసక్తికర వ్యాఖ్యలు

కొత్త సినిమా విడుదల అయినప్పుడు అప్పటికప్పుడు టికెట్ ధరలు పెంచకుండా ఒక సమగ్ర విధానం అమలు చేస్తాం అన్నారు మంత్రి కందుల దుర్గేష్.. అటు సినిమా పరిశ్రమకు.. ఇటు సినీ ప్రేక్షకులకు న్యాయం జరిగేలా టికెట్ రేట్లు ఉండేలా చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సినిమా టికెట్ రేట్ల కు సంబంధించి ప్రభుత్వం ఇవాళ సమావేశం నిర్వహించింది. సినిమా ప్రముఖులు%౯ా% ప్రభుత్వ ఉన్నతాధికారులు తో సమావేశం నిర్వహించారు.. ప్రతి సారి కొత్త సినిమా విడుదల అయినప్పుడు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. సినిమా టికెట్ రేట్లు పెరిగి.. సినిమాకు వెళ్లి పాప్ కార్న్ కనుక్కోవడం కూడా కష్టంగా మారిందన్నారు దర్శకుడు తేజ. అయితే, ప్రతి సారి సినిమా టికెట్ రేట్లు పెంచడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి అన్నారు దుర్గేష్.. టికెట్ రేట్లకు సంబంధించి ఒకే జీవో ఉండేలా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు..

## మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్.. మూడేళ్ల హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం

ఈ సందర్భంగా నాగేశ్వరమ్మకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందిస్తానని, ఆమె మనవడి విద్య కోసం మరో రూ.లక్ష అందజేస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. అంతేకాదు తన జీతం నుంచి ప్రతి నెలా రూ.5 వేల సాయం చేస్తానని హామీ ఇచ్చారు. "నాలుగు రోజులుగా రావాలనుకున్నాను కానీ అధికారిక పనుల వల్ల వీలుకాలేదు. ఈరోజు మాత్రం మీకిచ్చిన మాట నిలబెట్టుకోవడానికి అన్ని పనులు వాయిదా వేసుకుని వచ్చాను" అంటూ పవన్ భావోద్వేగంగా మాట్లాడారు. 2022 నవంబర్‌లో పవన్ కల్యాణ్ ఇప్పటం గ్రామాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ కోసం భూములు ఇచ్చిన గ్రామస్తుల ఇళ్లు అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో కూల్చివేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో నాగేశ్వరమ్మ పవన్ కల్యాణ్‌ను కలిసి, ఎన్నికల్లో గెలిచిన తర్వాత తన ఇంటికి రావాలని కోరగా ఆయన మాటిచ్చారు. 2024 ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో పవన్ కల్యాణ్ తన మాటను నిలబెట్టుకుంటూ ఇప్పటం గ్రామానికి వచ్చారు.

## బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ శాఖకు 'చీకటి రోజులు'..

తెలంగాణ రాష్ట్ర సాగునీటి రంగంపై గత పదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని ఎండగడుతూ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసనసభలో కీలక వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలనే కనీస చిత్తశుద్ధి లేదని ఆయన ధ్వజమెత్తారు. కృష్ణా జలాల్లో తమ వాటాగా ఉన్న 299 టీఎంసీల నీటిలో పాలమూరు–నల్గొండ జిల్లాల ప్రాజెక్టుల కోసం కేసీఆర్ ప్రభుత్వం ఏనాడూ గట్టిగా డిమాండ్ చేయలేదని మండిపడ్డారు. పదేళ్ల సుదీర్ఘ పాలనలో బీఆర్ఎస్ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయిందని, కానీ కాళేశ్వరం పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తే చివరికి మూడు బ్యారేజీలు కూలిపోయే పరిస్థితి వచ్చిందని ఆయన విమర్శించారు. గత పాలకుల నిర్వాకం వల్ల పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఏకంగా 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, కనీసం ఒక్క ఎకరాకు కూడా నీరు అందించలేకపోయారని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇరిగేషన్ శాఖకు ఎంతో మంచి పేరు ఉండేదని, కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టులను మార్చారని ఆరోపించారు. ఒక ట్రంక్ లైన్ వేసి, అందులో భారీగా లాభపడి, దానికే ఆహా ఓహో అంటూ సంబరాలు జరుపుకోవడం వారి స్థాయికి నిదర్శనమని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టినప్పుడు, వాటిని ఆపాలని కోరుతూ కేంద్రం అపెక్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తే, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ సమావేశానికి హాజరుకాకపోవడం ఇరిగేషన్ శాఖ చరిత్రలోనే ఒక 'చీకటి రోజు' అని ఆయన అభివర్ణించారు. బీఆర్ఎస్ వైఫల్యాలను గణాంకాలతో వివరిస్తూ, 2004 నుండి 2014 వరకు 715 టీఎంసీల కృష్ణా జలాలు బేసిన్ దాటి వెళ్తే, బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో ఏకంగా 1442 టీఎంసీల నీళ్లు బేసిన్ దాటి బయటకు వెళ్లిపోయాయని మంత్రి వెల్లడించారు. ఎస్ఎల్బీసి పనులను పదేళ్లలో పూర్తి చేయలేకపోయిన బీఆర్ఎస్, కోవిడ్ నెపం చెప్పడం హాస్యాస్పదమని, కోవిడ్ ఉన్నప్పుడు కాళేశ్వరం పనులు ఎలా పూర్తి చేశారని ఆయన ప్రశ్నించారు.

# శిక్షణ పూర్తి చేసుకున్న యువ ఆపదమిత్రులు

## ధ్రువపత్రాలను అందజేసిన హైడ్రా కమిషనర్
## ఆపదలో ఆదుకునేలా శిక్షణ ఉందన్న వాలంటీర్లు



హైదరాబాద్, నవతరం: యువ ఆపద మిత్రులు సిద్ధమయ్యారు. హైడ్రాలో వారం రోజుల శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఆపద సమయంలో ఎలా తనను తాను రక్షించుకోవాలో.. చుట్టు పక్కల వారిని ఎలా కాపాడాలో తెలుసుకున్నారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మొదటి రెస్పాండెంట్‌గా ఎలా స్పందించాలో అవగాహన తెచ్చుకున్నారు. హైడ్రా ఆధ్వర్యంలో యువ ఆపద మిత్ర శిక్షణ పూర్తి చేసుకున్న 78 మంది వాలంటీర్లకు మంగళవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ధ్రువపత్రాలను అందజేశారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రారంభించిన యువ ఆపద మిత్ర పథకంలో భాగంగా నిజామాబాద్ లోని గిరిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎంపికైన 78 మంది వాలంటీర్లకు గత బుధవారం హైడ్రాలో శిక్షణ ప్రారంభమైన విషయం విధితమే. వారం రోజుల శిక్షణ పూర్తయిన సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వారితో మాట్లాడారు. శిక్షణ ఎలా జరిగింది.. ఏం నేర్చుకున్నారో నేరుగా వారినే అడిగి తెలుసుకున్నారు.

**సాధన చేస్తే సాధించలేనిది ఏమీ లేదు**

సాధన చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదని యువ ఆపద మిత్ర వాలంటీర్లకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వారం రోజుల హైడ్రా శిక్షణలో నేర్చుకున్న అంశాలతో పాటు.. మీరు గొప్ప వ్యక్తులుగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడంలో కూడా పూర్తి అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మీరంతా యువ ఆపద మిత్రులు.. మీ ప్రత్యేకతను చాటాలని సూచించారు. ప్రమాద సమయంలో గందరగోళానికి గురి కాకుండా.. తక్షణ సహాయకులుగా రంగంలోకి దిగాలన్నారు. తర్వాత వివిధ విభాగాలకు చెందిన వారితో సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. అందుకే క్షేత్ర స్థాయిలో పరిస్థితులను కూడా ఈ శిక్షణలో భాగం చేశామన్నారు. తోటివారికంటే మీరు ముందుండడమే కాదు.. సహచరులకు కూడా అవగాహన కల్పించి ఆపద సమయంలో మీతో కలసి పని చేసేలా సిద్ధం చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు. జిల్లాల్లో కూడా ఇలాంటి శిక్షణ ఉంటే బాగుంటుందని విద్యార్థినులు చేసిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరికీ ఈ శిక్షణ అవసరముందని చెప్పారు.

**వారం రోజుల శిక్షణ ఇలా సాగింది..**

హైడ్రా కమిషనర్ ఆదేశాలమేరకు.. యువ ఆపద మిత్ర వాలంటీర్లకు క్షేత్ర స్థాయిలో కూడా పలు విషయాలపై అవగాహన కల్పించామని హైడ్రా అధికారులు వివరించారు. అగ్ని ప్రమాదంలో ఒకే ఇంట్లో 17 మంది ప్రాణాలు కోల్పోయిన పాతబస్తీ గుల్జార్ హౌస్ ప్రాంతానికి తీసుకెళ్లామన్నారు. బతుకమ్మ కుంటలో బోటు ద్వారా వరదల్లో చిక్కుకున్నవారిని ఎలా కాపాడాలో, ప్రథమ చికిత్స ఎలా అందించాలో వివరించాం. వంటింటి ప్రమాదాలతో పాటు అగ్ని ప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రాక్టికల్ గా చెప్పామన్నారు. వాతావరణ శాఖ కార్యాలయానికి తీసుకెళ్లి.. వాతావరణ సమాచారాన్ని ఎలా అర్థం చేసుకోవాలి.. ఐసీసీసీ(కమాండ్ కంట్రోల్ రూం)లో తెలంగాణ వ్యాప్తంగా నిఘా వ్యవస్థ ఎలా పని చేస్తోందనే విషయాలు చూపించామని చెప్పారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, అడిషనల్ కమిషనర్ ఆర్. సుదర్శన్, ఆర్ఎఫ్వో జయప్రకాష్, డీఎఫ్వో గౌతమ్, ఏడీఎఫ్వో మోహనరావుతో పాటు.. ఎస్ ఎఫ్ వోలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**మాలో ధైర్యాన్ని పెంచిన హైడ్రా శిక్షణ**

హైడ్రా శిక్షణలో అనేక విషయాలు తెలుసుకున్నామని యువ ఆపద మిత్ర వాలంటీర్లు తెలిపారు. బయట ప్రపంచాన్ని చూశామన్నారు. ప్రభుత్వ విభాగాలు ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నామని చెప్పారు. ఈ వారం రోజుల పాటు నేర్చుకున్న లైఫ్ స్కిల్స్ జీవితాంతం ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. ప్రమాద సమయంలో గందరగోళానికి గురి కాకుండా.. ఎలా స్పందించాలి, ఎలా నివారించాలి.. అనే విషయాలు క్షుణ్ణంగా తెలుసుకున్నాం. పాఠ్యాంశాల బోధన కూడా ఇలా జరిగితే.. ఎంతో ఉపయోగంగా ఉంటుందని వాలంటీర్లు తెలిపారు. తరగతి గదిలో విషయాలను విని.. క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్‌గా తెలుసుకున్నామన్నారు. ఈ శిక్షణతో మాలో ఎంత ధైర్యం వచ్చింది. మాతో పాటు తోటివారిని రక్షించే విధంగా మేమంతా సిద్ధమయ్యామని సంతృప్తి వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, తోటివారితో ఎలా మాట్లాడాలి ఇలా అనేక అంశాలు తెలుసుకున్నాం.. హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తో రెండుసార్లు కలిసే అవకాశం రావడం.. ఈ సందర్భంగా చెప్పిన మాటలు జీవితాంతం గుర్తుండిపోతాయని వాలంటీర్లు చెప్పారు.

# కబడ్డీ క్రీడలలో కంచు పథకం

## భద్రాచలం ఐటీడీఏ తరఫున పాల్గొన్న పురుషుల కబడ్డీ క్రీడలలో మూడో స్థానం నిలిచి బ్రాంజ్ (కంచు) పథకం
## అభినందించిన ప్రాజెక్టు అధికారి బి. రాహుల్







భద్రాచలం, డిసెంబర్ 24, నవతరం : భారత మంత్రిత్వ శాఖ పంచాయతీరాజ్ విధాన విభాగం న్యూఢిల్లీ కార్యాలయం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయస్థాయి పీసా మహోత్సవంలో భద్రాచలం ఐటీడీఏ తరపున పాల్గొన్న క్రీడాకారులు పురుషుల కబడ్డీ క్రీడలలో మూడో స్థానం నిలిచి బ్రాంజ్ (కంచు) పథకం సాధించడం జరిగిందని ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బుధవారం నాడు జాతీయస్థాయి పీసా మహోత్సవాలు విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న పిసా ఉత్సవాలు చివరి రోజు వివిధ క్రీడలలో ఐటీడీఏ భద్రాచలం తరఫున పాల్గొన్న పురుషుల కబడ్డీ జట్టు మూడో స్థానంలో నిలిచిన జట్టుకు మినిస్టరీ ఆఫ్ పంచాయతీరాజ్ సెక్రెటరీ న్యూఢిల్లీ వివేక్ భరద్వాజ్, మినిస్టరీ ఆఫ్ పంచాయతీరాజ్ డైరెక్టర్ రమిత్ మౌర్య, ప్రిన్సిపాల్ సెక్రటరీ మరియు కమిషనర్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ ఆంధ్ర ప్రదేశ్ శశిభూషణ్ కుమార్ వారి చేతులు మీదుగా క్రీడాకారులతోపాటు భద్రాచలం ఐటిడిఏ తరపున పాల్గొన్న సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ మరియు స్పెషల్ ఆఫీసర్ డేవిడ్ రాజ్ కంచు పథకమును మరియు 50 వేల రూపాయల నగదు పారితోషకాన్ని అందుకున్నారు. జాతీయస్థాయి పీసా మహోత్సవాలలో పది దేశాలు పాల్గొన్న పాల్గొన్న ప్రతినిధులు ఐటీడీఏ భద్రాచలం తరపున ఏర్పాటు చేసిన గిరిజన వంటకాల స్టాల్ లో వారికి ఇష్టమైన గిరిజన వంటకాలు తనివి తీర చవిచూసి, కోయా క్రాఫ్ట్ వస్తువులు కొనుగోలు సంతోషం వ్యక్తం చేశారని ఆయన అన్నారు. ఈ ఉత్సవాలలో పాల్గొన్న అధికారులకు మరియు క్రీడాకారులకు ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీమతి జ్యోతి, పి ఆర్ డి డి సుభాష్ చంద్ర గౌడ్, కొండ్రు సుధారాణి, శీలం దుర్గ, గుండి లత, జజ్జురా నిఖిల్, పాయం కృష్ణమూర్తి మరియు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ పబ్బం గడుపుకోవడమే వీరి పని
## పాలమూరు రంగారెడ్డి పట్ల చిత్తశుద్ధి లేదు

రంగారెడ్డి, నవతరం: బుధవారం, షాద్‌నగర్ నియోజకవర్గ జాగృతి ఇంచార్జ్ చీమల రమేశ్, జాగృతి సీనియర్ నాయకులు చలసాని విష్ణుమూర్తి, నాగని ప్రకాశ్ తో కలసి నిర్వహించిన విలేఖరుల సమావేశంలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ తెలంగాణ ఉద్యమ నినాదంలో నీళ్ళు, నిధులు, నియమకాలు అందులో 'నీళ్లు' మొదటి అంశం. కానీ పదేళ్ల బీఆర్ఎస్ పాలన అనంతరం వెనక్కి తిరిగి చూస్తే దక్షిణ తెలంగాణకు గుండెకాయ వంటి 'పాలమూరు–రంగారెడ్డి' ఎత్తిపోతల పథకం కేవలం ఒక రాజకీయ నినాదంగానే ఉండి పోయిందే తప్ప ఉమ్మడి పాలమూరు రంగారెడ్డి, జిల్లా ప్రజలకు పెద్దగా ఒనగూరింది ఏమి లేదు బీఆర్ఎస్ హయాంలోనే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలోనే పూర్తి చేశామని చెప్పుకొనే బిఆర్ఎస్.. పాలమూరు ప్రాజెక్టును మాత్రం పదేళ్లపాటు పాతరేశారని వారు మండి పడ్డారు. ఇప్పుడు నిద్రలేసిన బిఆర్ ఎస్ నాయకులు ఇప్పుడు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పై అవలంబిస్తున్న విధానం వల్ల 90 టీఎంసీల నుంచి 45 టీఎంసీలకు తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రల వల్ల జిల్లాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుంది అని మొసలి కన్నీరు కారుస్తు రాజకీయ ఉనికికోసం మభ్యపెడుతున్నరని అన్నారు. బిఆర్ఎస్, బీజేపీతో ఉన్న స్నేహాన్ని కేవలం తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారే తప్ప, తెలంగాణ ప్రాజెక్ట్ కు అనుమతుల కోసం ఒత్తిడి చేయలేదని అన్నారు. కేంద్రం పాలమూరు డీపీఆర్ ను వెనక్కి పంపిందంటే దానికి కారణం బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల బాధ్యతారాహిత్యమని వారు మండిపడ్డారు.





# హ్యాపీ క్రిస్మస్... మెర్రీ క్రిస్మస్..

## ప్రజలందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు...
## మాజీ మంత్రివర్యులు మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి



మేడ్చల్, డిసెంబర్ 24,నవతరం: తెలంగాణ రాష్ట్రము మరియు మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు, క్రైస్తవ సోదర, సోదరీమణులకు చామకూర మల్లారెడ్డి క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ భావాన్ని, సేవాతత్పరతను, క్షమా గుణాన్నీ బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అని పేర్కొన్నారు. పర్వదినం క్రిస్టియన్ సోదరులు అందరికి శుభం చేకూరాలని, కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో క్రిస్మస్ వేడుక జరుపుకోవాలని ఆకాంక్షించారు. యేసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికీ లభించాలని, అందరూ సంతోషంగా జీవించాలని ప్రార్థించారు.



## గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది : ఎమ్మెల్యే జారె

నవతరం, అశ్వారావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలం,కొమ్ముగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం అశ్వారావుపేట మండలం, ఆసుపాక గ్రామంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవనాలు ప్రజల సమస్యల పరిష్కారానికి కేంద్రబిందువులుగా ఉండాలన్నారు. కమ్యూనిటీ భవనాలు గ్రామస్తుల సామాజిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుందని ప్రతి గ్రామంలో అవసరమైన ప్రభుత్వ భవనాలు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో అశ్వారావుపేట నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## సమస్యలను తెలుసుకుంటున్న
# సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి

నవతరం,అశ్వారావుపేట : అశ్వారావుపేట నియోజకవర్గం,ములకలపల్లి మండలంలో ముకమామిడి గ్రామ పంచాయతీ లో నాల్గవ వార్డు లో ఉన్న మంచినీటి ట్యాంక్ ను పరిశీలించిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి. ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్ సమస్యను పంపు ఆపరేటర్ ద్వారా అడిగి తెలుసుకోవడం జరిగింది. వాటర్ ట్యాంక్ శుభ్రపరచడానికి ట్యాంక్ లోన వెళ్లడానికి మెట్లు లేక శుభ్రపరచడం సమస్యగా మారిందినీ,వాటర్ ట్యాంక్ పైకి ఎక్కడానికి మెట్లు లేక ఇబ్బంది పడుతున్నారని ఐరన్ స్టాండ్ తో నిర్మించిన మెట్లు తుప్పు పట్టి పోవడం పైకి ఎక్కడానికి సమస్యగా మారిందని తెలిపారు. గేట్ వాల్ లేక నీరు ఇళ్లల్లోకి వృథాగా పోతుంది అని పంపు ఆపరేటర్ తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ వీలైన త్వరలో మెట్లు,గేట్ వాల్ రిపేర్ చేయించి వాటర్ ట్యాంక్ శుభ్రపరచి ప్రజలకు మంచినీటిని అందించడానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంచినీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా గొంతుక రిపోర్టర్ గడ్డం వెంకటేష్,పంచాయతీ సిబ్బంది బత్తుల సంజీవరావు,కోర్సా వెంకటేష్ మరియు గ్రామ పెద్దలు పాయం ముత్యాలు తదితరులు ఉన్నారు.

# సెజ్ ఔషధాలకు ట్యాక్స్ రిలీఫ్

న్యూఢిల్లీ: దేశీయంగా కీలక ఔషధాల లభ్యత పెరిగేలా, ధరలు తగ్గేలా చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ప్రత్యేక ఆర్థిక మండళ్లలో (సెజ్) తయారు చేసి, దేశీయంగా విక్రయించే ఔషధాలపై కస్టమ్స్ సుంకాలను ఎత్తివేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సెజ్‌లలో తయారై, దేశీయ మార్కెట్లో అమ్మే ఔషధాలపై 10 శాతం సుంకాలు వర్తిస్తున్నాయి. ఒకవేళ తాజా ప్రతిపాదన ఆచరణ రూపం దాలిస్తే సదరు సుంకాల ప్రస్తావన లేకుండా పలు టీకాలు, కీలక ఔషధాలను దేశీయంగా తక్కువ ధరకే విక్రయించేందుకు వీలవుతుంది. అయితే, ఏకమొత్తంగా అన్ని ఔషధాలకు కాకుండా కొన్ని ఉత్పత్తులకు మాత్రమే మినహాయింపులను వర్తింప చేయొచ్చని భావిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఈ మేరకు ప్రతిపాదనను చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ముందుగా ఎంపిక చేసిన కొన్ని టీకాలు, కొన్ని కీలకమైన ఔషధాలు, ప్రభుత్వం నిర్ణయించే ఉత్పత్తులకు మినహాయింపునివ్వొచ్చని పేర్కొన్నాయి.



# అదిరే స్టిల్‌తో మన శంకర వరప్రసాద్ గారు

మెగాస్టార్ చిరంజీవి మాస్-అండ్-ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంఅద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో సంచలనం సృష్టిస్తోంది.విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు.షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.తాజాగా మేకర్స్ సినిమా నుంచి రిలీజ్ చేసిన మెగాస్టార్ చిరంజీవి కొత్త స్టిల్ అదిరిపోయింది. బ్లాక్ సూట్, వైట్ షర్ట్, కళ్లకు డార్క్ గ్లాసెస్ తో ఒక చేతిలో గన్ పట్టుకుని స్టైలిష్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న మెగాస్టార్ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇప్పటికే మీసాల పిల్ల, శశిరేఖ పాటలు చార్ట్‌బస్టర్ హిట్స్ గా సంచలనం సృష్టించాయి. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న చిరంజీవి, వెంకటేష్ పై చిత్రీకరించిన పాటని రిలీజ్ చేయబోతున్నారు. దీనికి సంబంధించిన అనౌన్స్ మెంట్ త్వరలోనే రాబోతోంది. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న మన శంకర వర ప్రసాద్ గారు జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది.



# వండర్ ఫుల్ విజువల్స్‌తో వృషభ

మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ "వృషభ". ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ఈ నెల 25న గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తోంది. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ - భారీ బడ్జెట్ ఖర్చు పెట్టి "వృషభ" సినిమాను నిర్మించారు. ఈ సినిమా విజువల్స్ గ్రాండ్ గా ఉంటాయి. కింగ్ ఎపిసోడ్ వచ్చినప్పటి నుంచి సినిమా మరో స్థాయికి వెళ్తుంది. ఫైట్స్, ఎమోషనల్ కంటెంట్ కూడా బాగుంటుంది. సామ్ సీఎస్ గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. నేను దాదాపు 45 నిమిషాల ఫుటేజ్ చూశాను. సమర్జిత్ లో ఈజ్ ఉంది. అతను కన్నడలో పెద్ద స్టార్ అవుతాడు. నయన్ ఆయ్, క సినిమాల తర్వాత వృషభతో హ్యాట్రిక్ అందుకోవాలి. మోహన్ లాల్ గారు అంటే మనందరికీ గౌరవం. ఆయన ఈ సినిమాను రిలీజ్ చేసే అవకాశం మాకు ఇచ్చినందుకు సంతోషంగా ఉంది అన్నారు.



# 'శంబాల' లాంటి చిత్రాల్ని థియేటర్లో చూస్తేనే ఆ ఫీల్‌ను ఎంజాయ్ చేయగలుగుతారు

**::: హీరో ఆది సాయి కుమార్**

ఆది సాయి కుమార్ హీరోగా తెరకెక్కిన 'శంబాల' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 23న ఆది సాయి కుమార్ పుట్టిన రోజు సందర్భంగా మీడియాతో ముచ్చటిస్తూ 'శంబాల' గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. 'శంబాల' చిత్రం బాగా వచ్చింది. ఆడియెన్స్‌కి మా సినిమా బాగా నచ్చుతుంది.'శంబాల' చిత్రంలో అద్భుతమైన పోరాట సన్నివేశాలున్నాయి. రాజ్ కుమార్ మాస్టర్ అన్ని యాక్షన్ సీక్వెన్స్‌కి రిహార్సల్స్ చేశారు. దర్శకుడు యుగంధర్‌తో పాటుగా రాజ్ కుమార్ ట్రావెల్ చేశారు. క్లైమాక్స్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్ అదిరిపోతుంది. 80వ దశకంలో వచ్చే కథ కాబట్టి.. లుక్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. అందుకే కాస్ట్యూమ్స్ ని చాలా సెలెక్టివ్‌గా తీసుకున్నాం.'శంబాల' చిత్రంలో ఎక్కువ వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉండవు. కానీ ఉన్న వాటిని మాత్రం చాలా జాగ్రత్తగా చేసుకున్నాం. ఆ అవుట్ పుట్ చూసి మేం అంతా సంతృప్తి చెందాం. 'శంబాల' అనేది ఉందా? లేదా? అనేది ఎవ్వరికీ తెలీదు. మన పురాణాల ప్రకారం శంబాలకి ఓ మంచి గుర్తింపు ఉంది. శంబాల అని టైటిల్ చెప్పినప్పుడే నేను చాలా ఎగ్జైట్ అయ్యాను.యుగంధర్‌కి సినిమా పట్ల చాలా ప్యాషన్ ఉంటుంది. యుగంధర్ గారి మొదటి చిత్రం నాకు చాలా ఇష్టం. ఈ కథ కోసం ఆయన చాలా కష్టపడ్డారు. చెప్పిన కథను తెరపై చూపించారు. ఆయన పెద్ద డైరెక్టర్ అవుతారు. నిర్మాతలు ఎంతో ప్యాషన్‌తో 'శంబాల'ని నిర్మించారు. మేం ఎక్కడా కూడా వేస్టేజ్ చేయకుండా సినిమాను తీశాం. నా మార్కెట్ కంటే ఎక్కువగానే ఖర్చు పెట్టారు అన్నారు.

# సిగ్మా టీజర్ రిలీజ్



సుబాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ మరో ప్రతిష్టాత్మక వెంచర్ సిగ్మా తో రాబోతోంది. ఈ సినిమాతో కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సందీప్ కిషన్ హీరో నటిస్తున్న ఈ చిత్రం యాక్షన్-అడ్వెంచర్ కామెడీగా రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ కు అద్భుతమై రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ అదిరిపోయే టీజర్ రిలీజ్ చేశారు. దర్శకుడిగా జేసన్ సంజయ్ తొలి అడుగే బలమైన స్టేట్‌మెంట్‌లా కనిపిస్తుంది. స్టైలిష్‌గా, హై-ఆక్టేన్ కట్స్‌తో రూపొందిన ఈ టీజర్‌లో ఆయన కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపిస్తుంది. ఎస్. తమన్ అందించిన దుమ్మురేపే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ఎనర్జీ, ఇంటెన్సిటీని మరింత పెంచింది. సందీప్ కిషన్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో టీజర్ లో అదరగొట్టారు. యాక్షన్, ఇంటెన్సిటీ, ఎనర్జీమూడు అంశాల్లోనూ ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోతుంది. అంతర్గత సంఘర్షణ, ఆశయం, సహజ స్వభావంతో మలచబడిన పాత్రలో ఆకట్టుకున్నారు. సందీప్ కిషన్‌కు జోడీగా ఫరియా అబ్దుల్లా నటిస్తుండగా, రాజు సుందరం, అన్బు థాసన్, యోగ్ జాపీ, సంపత్ రాజ్, కిరణ్ కొండ, మహాలక్ష్మి సుధర్శనన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కేథరిన్ ఒక హై-ఎనర్జీ స్పెషల్ సాంగ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. మల్టిలింగ్వల్ చిత్రంగా రూపొందుతున్న సిగ్మా 2026 సమ్మర్‌లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.

# 'మ్యాజిక్ డిస్ట్రిక్ట్' ప్రారంభం



కొండాపూర్ లోని శావీదీ మాల్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో ఆసియాలోనే మొట్టమొదటి రియల్-లైఫ్ మల్టీ-థీమ్ అడ్వెంచర్ డెస్టినేషన్ 'మ్యాజిక్ డిస్ట్రిక్ట్' ప్రారంభమైంది. AMB మాల్‌లోని 6వ అంతస్తులో సుమారు 38,000 చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేశారు. ఇది కేవలం చూసే వినోదం మాత్రమే కాదు, సందర్శకులు స్వయంగా కథలో పాత్రధారులుగా మారి నడుస్తూ సాహసాలను అనుభవించే సరికొత్త ఫార్మాట్.నేషనల్ అవార్డు గ్రహీత, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ తవ్వ శ్రీనివాస్ ఈ 'మ్యాజిక్ డిస్ట్రిక్ట్'కు రూపకల్పన చేశారు. భారతీయుల మేధస్సు, సృజనాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. భారతీయ ప్రజలకు సరికొత్త సాహసాలను పరిచయం చేసేందుకు మా కూతురు, ఆపరేషన్ మేనేజర్ చందన లిపి అమెరికాలో జాబ్ వదిలేసి వచ్చింది. ఈ ఫేస్ 1 ఇప్పుడు ప్రారంభించాము అన్నారు తవ్వ శ్రీనివాస్. ఆపరేషన్ డైరెక్టర్ చందన లిపి మాట్లాడుతూ... మొదటి దశలో నాలుగు సాహస ప్రపంచాలను అందుబాటులోకి తీసుకొచ్చాము అన్నారు.






Owned and Published by Sirigiri Varadaraju, Printed at: Shesha Sai Enterprises, Plot No. 98/1, CIE, Phase 2, Gandhinagar, Hyderabad - 37, Telangana State, India, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com